క్లుప్తంగా

అవార్డు గ్రహీత స్టాలిన్‌కు సత్కారం


సతీష్‌చంద్ర స్టాలిన్‌కు మెమెంటో అందజేస్తున్న నాయకులు

కడియం: ఉమెన్ ఫ్రెండ్లీ విభాగంలో రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్న వైఎస్సార్ సీపీ కడియం మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్‌ను ఆదివారం ఘనంగా సత్కరించారు. మూడు రోజులుగా జేగురుపాడులో బైబిలు మిషను మహాసభలు పాస్టర్ సాకా మహిమరాజు ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా జేగురుపాడు గ్రామానికి రాష్ట్రస్థాయిలో పేరు తీసుకువచ్చిన స్టాలిన్‌ను పాస్టర్స్ ఫెలోషిప్‌తో కలిసి శాలువా, మెమెంటోలు అందజేసి సత్కరించారు.

వికాస్ సంస్థ సేవలు స్ఫూర్తిదాయకం

సీటీఆర్ఐ: ప్రతి నెలా ఏడోతేదీన క్రమం తప్పకుండా వృద్ధులకు పింఛన్లు అంజేస్తున్న వికాస్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మాధవరపు భాస్కరరావు అన్నారు. స్థానిక వీఎల్ పురం పార్కులో ఆదివారం నిర్వహించిన పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వికాస్ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ యార్లగడ్డ ప్రభాకర్ తన జీతంలో సగానికి పైగా భాగాన్ని వృద్ధులు, వితంతువులు, విద్యార్థుల సంక్షేమానికి వెచ్చించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా వంద మంది వృద్ధులకు రూ.200 చొప్పన అందజేశారు.

నేటి నుంచి వేసవి శిక్షణ తరగతులు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న లైబ్రేరియన్ శ్రీదేవి, పాఠకులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఈనెల 11వ తేదీ వరకు ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ పి.శ్రీదేవి తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పుస్తక పఠనం, నీతికథలు చెప్పడం, రాయడం, తెలుగు పద్యాలు, చిత్రలేఖనం, లైఫ్ స్కిల్, వేదిక్ మ్యాథ్స్, స్పోకెన్ ఇంగ్లిష్, లలిత సంగీతం, నృత్యం, చదరంగం, హ్యాండ్‌క్రాఫ్ట్, యోగాపై తరగతులు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వేసవి శిక్షణ తరగతుల పోస్టర్‌ను ఆవిష్కరించారు.

వేసవి శిక్షణ ప్రారంభం

ప్రకాశం నగర్: ఆంధ్రకేసరి యువజన సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్వాతంత్య్ర సమర యోధుల భవనంలో విద్యార్థులకు సామాజిక విషయాల శిక్షణ తరగతులను సమితి మాజీ అధ్యక్షుడు సన్నిధానం శాస్త్రి ప్రారంభించారు. కార్యక్రమంలో పెదిరెడ్ల శ్రీనివాస్, దుర్వాసుల సత్యనారాయణ పాల్గొన్నారు.

బాలవికాస వార్షికోత్సవం

ప్రకాశం నగర్: విద్యానగర్ సమితి కన్వీనర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక పీఅండ్‌టీ కాలనీలోని వైఎస్సార్ సీపీ నాయకురాలు సీహెచ్ సత్యవాణి నివాసంలో ఆదివారం బాల వికాస వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ పోలు విజయలక్ష్మి, గాండ్ల తెలుకుల కార్పొరేషన్ చైర్మన్ సంకిస భవానీ ప్రియ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పిల్లలు తమ తల్లులకు పాదపూజ నిర్వహించారు. అనంతరం జరిగిన పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలైన చిన్నారులకు బహుమతులు అందజేశారు.

సమస్యలపై దశలవారీ పోరాటం

ప్రకాశం నగర్: సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా పోరాటానికి 104 ఉద్యోగులు సిద్ధపడాలని ఆ ఉద్యోగుల సంఘం నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక పేపర్ మిల్లు వద్ద గల బీటీఆర్ భవన్‌లో ఆదివారం జిల్లా అధ్యక్షుడు అలపాటి లక్ష్మణరావు అధ్యక్షతన 104 ఉద్యోగుల జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా గౌరవ అధ్యక్షుడు బి.రాజులోవ, జిల్లా కార్యదర్శి మూల సింహాద్రి నాయుడు మాట్లాడుతూ 104 ఉద్యోగులకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించలేదన్నారు. ప్రభుత్వం వెంటనే బకాయి వేతనాలు విడుదల చేయాలని కోరారు.

సంజీవయ్యకు నివాళి

ప్రకాశం నగర్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య వర్ధంతిని ఆదివారం గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎస్సీ నాయకులు కోరుకొండ చిరంజీవి, తాళ్లూరి బాబూ రాజేంద్ర ప్రసాద్, పాము బాబూరావు, సోమాబత్తుల విజయకుమార్ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.


నగరంలో మధ్యాహ్నం వేళ భానుడి ఉగ్రరూపం


సాయంత్రం వరుణుడి ప్రతాపం

మండుటెండ.. జోరువాన

- విచిత్ర వాతావరణంతో ఇబ్బందులు
- ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలంటున్న వైద్యులు

సీటీఆర్ఐ: ఏప్రిల్ ప్రారంభం నుంచే భానుడు ఉగ్రరూపం చూపించడంతో మేలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందారు. అయితే వరుణుడి రాకతో కొంత ఉపశమనం కలిగింది. సాధారణంగా మేలో అధిక ఉష్ణోగ్రతలతో పాటు, విపరీతమైన ఉక్కబోత ఉంటాయి. దానికి భిన్నంగా మే నెల ప్రారంభం నుంచి వర్షాలు కురవడంతో ఎండ తీవ్రత తగ్గింది. ఏప్రిల్‌లో అత్యధికంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రత నగరంలో కనిపించింది. దీనితో అధిక ఉష్ణోగ్రతలకు అల్లాడిన ప్రజలు మే నెలను తలుచుకుని భయపడ్డారు. అయితే అనుకోకుండా వరుణుడు మే నెల ప్రారంభం నుంచే వర్షరూపంలో ఆదుకున్నాడు. గత వారం రోజులుగా భారీ నుంచి తేలికపాటి వర్షాలు నగరాన్ని ముంచెత్తుతున్నాయి.

విచిత్ర వాతావరణం

ప్రస్తుతం విచిత్ర వాతావరణంతో నగరంలో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం నుంచి ఎండ అధికంగా కాస్తోంది. సాయంత్రం ఒక మోస్తారు వర్షం పడుతోంది. దీనితో ఎండలకు అల్లాడిన ప్రజలు, వర్షం వచ్చినప్పుడు విపరీతమైన చల్లదనానికి అనేక రకాలుగా ఇబ్బంది పడుతున్నారు. అప్పటి వరకూ ఎండ వేడితో శరీరంలో డిహైడ్రేషన్ ఏర్పడగా, వెంటనే పడిన వర్షానికి అనారోగ్య సమస్యలు తలెత్తున్నాయి. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. ఇటువంటి వాతావరణం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. వెంటవెంటనే మారే వాతావరణ పరిస్థితులు శరీరానికి హాని కలిగిస్తాయంటున్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

చిరు వ్యాపారుల ఆవేదన

నగరంలో కంబాల చెరువు, సెంట్రల్ జైలు రోడ్డు, గోకవరం బస్టాండ్ సెంటర్‌లలో అనేక చిరువ్యాపారాలు కొనసాగుతాయి. ఒక్క సెంట్రల్ జైల్ రోడ్డులోనే రోడ్డు కిరువైపులా సుమారు 150 వరకు దుకాణాలు ఉంటాయి. వివిధ రకాల పండ్లు, తాటి ముంజెలు, కొబ్బరి బొండాలు, సోడాలు వంటివి విక్రయిస్తారు. ఉదయమే వీరి వ్యాపారాలు మొదలవుతాయి. అయితే ఉదయం ఎండ కాచి సాయంత్రం నుంచి వర్షాలు కురవడంతో వీరి వ్యాపారానికి ఇబ్బంది కలుగుతోంది. వర్షం కారణంగా సాయంత్రం పూట ప్రజలు బయటకు ఎక్కువగా రావడం లేదు. దీంతో చిరువ్యాపారులు ఆవేదన చెందుతున్నారు.

పదిలో విద్యార్థుల ప్రతిభ

సాక్షి నెట్‌వర్క్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మంచి ఫలితాలు సాధించారు. విద్యాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు పథకంలో ఎంతో అభివృద్ధి చేశారు. కావాల్సిన అన్ని రకాల వసతులు కల్పించారు. చదువుతో పాటు విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలు పదోతరగతి ఫలితాల్లో ప్రతిభ చాటాయి.


పేరు: డి.భువనసింధు
మార్కులు: 579
స్కూలు : లాలాచెరువు హైస్కూలు
తండ్రి: డి.వీరభద్రస్వామి, కాంట్రాక్టు టీచర్
తల్లి: నాగమణి, ఉపాధ్యాయురాలు
లక్ష్యం: ట్రిపుల్ ఐటీ చదవడం


విద్యార్థి : దాసరి ప్రణయ్‌తేజ
స్కూలు : వీరవరం జెడ్పీహెచ్ఎస్
మార్కులు : 566
తండ్రి : దాసరి శ్రీనివాస్, రైతు
తల్లి : శాంతకుమారి
లక్ష్యం : ఇంజినీర్


విద్యార్థి : ఎండీ జహురున్నీసా బేగం
మార్కులు: 564
పాఠశాల: ధవళేశ్వరం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల
తండ్రి : మహ్మద్ మొహిద్దీన్, హోంగార్డు
తల్లి: మహ్మద్ షర్మిల, గృహిణి
లక్ష్యం: కంప్యూటర్ ఇంజినీర్


విద్యార్థి : కోరాడ లాస్యప్రవల్లిక
మార్కులు : 563
పాఠశాల: ధవళేశ్వరం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల
తండ్రి : విజయకృష్ణ, ఎలక్ట్రీషియన్
తల్లి : దుర్గాభవాని, టైలరింగ్
లక్ష్యం: సివిల్స్


విద్యార్థి : ఈలి అమృతవర్షిణి
మార్కులు : 558
పాఠశాల : బొమ్మూరు అంబేడ్కర్ గురుకుల పాఠశాల
తండ్రి: అప్పారావు, రైతు
తల్లి: వీరలక్ష్మి
లక్ష్యం : బ్యాంకు మేనేజర్

ఘనంగా రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ భరత్ రామ్


ఠాగూర్ జయంతిలో పాల్గొన్న చందన నాగేశ్వర్

సీటీఆర్ఐ: విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎంపీ మార్గాని భరత్ రామ్ పూలమాల వేసి నివాళులర్పించారు. సెంట్రల్ జైలు రోడ్డు గౌతమీ జీవకారుణ్య సంఘంలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంపీ భరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా నేత్ర వైద్య శిబిరాన్ని ఎంపీ భరత్, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ శిబిరంలో గౌతమీ జీవకారుణ్య సంఘంలోని వృద్ధులు, మహిళలకు గౌతమీ నేత్రాలయం వైద్య సిబ్బంది నేత్ర పరీక్షలు చేశారు. శిబిరాన్ని నిర్వహించిన నిర్వాహకులను, సేవలందజేసిన ఆదిత్య కళాశాల విద్యార్థులను ఎంపీ భరత్ అభినందించారు. అవసరమైన వారికి ఆపరేషన్లు ఉచితంగా నిర్వహించి, కళ్లజోళ్లను కూడా అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గౌతమీ జీవకారుణ్య సంఘం ఈఓ కె.విజయలక్ష్మి, సింగంపల్లి కార్తిక్, 50వ వార్డు ఇన్‌చార్జి గుత్తుల మురళీధర్, బర్రె కొండబాబు, గుర్రం గౌతమ్, కాంతారాం పాటిల్, కొత్తా విజయ రాజ్యలక్ష్మి, కొత్తా బాల మురళి పాల్గొన్నారు.

గౌతమీ జీవకారుణ్య సంఘంలో..

విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంత్యుత్సవంలో పాల్గొనడం తన అదృష్టమని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీగ్రీనింగ్అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. ఆదివారం స్థానిక గౌతమీ జీవకారుణ్య సంఘం ఆవరణలో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఖాదీబోర్డ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ పిల్లి నిర్మల, హితకారిణి ట్రస్ట్ డైరెక్టర్ సరితా రాణి పాల్గొన్నారు.

ఉత్సాహానికి చిరునామా హ్యాపీస్ట్రీట్

- ఎంపీ భరత్‌రామ్
- చిన్నారులతో కలిసి సందడి


హ్యాపీస్ట్రీట్‌లో చిన్నారులతో ఎంపీ మార్గాని భరత్‌రామ్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): హ్యాపీస్ట్రీట్‌కు వచ్చిన అందరిలో ఉరకలెత్తుతున్న ఉత్సాహం చూస్తుంటే చాలా ఆనందంగా ఉందని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. ఏకేసీ కళాశాల రోడ్డులో ఏర్పాటు చేసిన హ్యాపీ స్ట్రీట్‌ను ఆదివారం రాత్రి ఆయన సందర్శించారు. చిన్నారులతో సమానంగా పెద్దలు, తల్లిదండ్రులు, వృద్ధులు ఆట పాటలలో పోటీపడడంతో ఆ ప్రాంతంలో సందడి నెలకొంది. మరోవైపు జుంబా డ్యాన్స్ ఆకట్టుకుంది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపైనే కాకుండా కింద కూడా పిల్లలు, పెద్దలు డ్యాన్స్ చేశారు. ఎంపీ భరత్ రామ్, కమిషనర్ కె.దినేష్ కుమార్ తదితరులు హ్యాపీ స్ట్రీట్‌లో తిరిగారు. ప్రజల అభిప్రాయాలను ఎంపీ భరత్ అడిగి తెలుసుకున్నారు. నగర పాలక సంస్థ ఈఈ కనకారావు, నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, గుర్రం గౌతమ్ పాల్గొన్నారు.

అల్లూరి స్ఫూర్తితో పోరాటం చేద్దాం


సీతారామరాజు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

మధురపూడి: అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వెంకట నాయుడు అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన కోరుకొండలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయుడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆదివాసీల హక్కులను కాలరాస్తోందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జనుపల్లి సత్తిబాబు, నాయకులు సూరి బాబు, సూర్యనారాయణ, నాగన్న పాల్గొన్నారు.

వేధింపులపై కేసు

సీతానగరం: గోపాలపురం మండలం పెద్దాపురానికి చెందిన కాస్సే కృష్ణతో మండలంలోని వెదుళ్లపల్లికి చెందిన కుసుమే విజయశాంతికి 2020 జూలైలో వివాహమైంది. అయితే ఉద్యోగం చేసి కుటుంబాన్ని పోషించాలంటూ విజయశాంతిని భర్త కృష్ణ, అత్త సరోజిని, ఆడపడుచులు విజయలక్ష్మి, తిరుపతమ్మ మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ బి.లక్ష్మణరావు ఆదివారం తెలిపారు.

అల్లూరి పోరాటం స్ఫూర్తిదాయకం


అల్లూరికి నివాళులర్పిస్తున్న కోసూరి వెంకటలక్ష్మి

ప్రకాశం నగర్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాటం స్ఫూర్తిదాయకమని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు అన్నారు. అల్లూరి వర్ధంతి సందర్భంగా ఆదివారం గోదావరి గట్టుపై ఉన్న ఆయన విగ్రహానికి జాతీయ కార్యవర్గ సభ్యుడు యర్ర కృష్ణ కుమార్‌తో కలసి వీరభద్రరావు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు చదువుకున్న నగరంలోని ఉల్లితోట బంగారయ్య స్కూలుకు ఆయన పేరు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సంఘం ఉపాధ్యక్షుడు మాదేటి రవి ప్రకాష్, కోశాధికారి బళ్లా శ్రీనివాస్, చీకట్ల శివన్నారాయణ పాల్గొన్నారు.

- ఆంధ్రకేసరి యువజన సమితి ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతిని స్థానిక గోదావరి గట్టున నిర్వహించారు. సమితి అధ్యక్షులు పెద్దిరెడ్డి శ్రీనివాస్, సన్నిధానం శాస్త్రి, మాదిరెడ్డి శ్రీనివాస్, దుర్వాసుల సత్యనారాయణ, దేశిరెడ్డి బలరాం నాయుడు పాల్గొన్నారు.
- సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో స్థానిక మాహోభవన్‌లో అల్లూరి వర్ధంతి జరిపారు. ఆయన చిత్రపటానికి సంఘం నాయకుడు కిరణ్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బొమ్మూరు వెంకటగిరి కొండపై..

రాజమహేంద్రవరం రూరల్: సీపీఎంఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో బొమ్మూరు వెంకటగిరి కొండపై పీఓడబ్ల్యూ నగర నాయకురాలు కోసూరి వెంకటలక్ష్మి.. అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కోరాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయం

ప్రకాశం నగర్: విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు తైలవర్ణ చిత్రాన్ని పార్లమెంట్‌లో ఏర్పాటు చేయాలని క్షత్రియ సేవాసమితి ప్రతినిధులు కోరారు. క్షత్రియ సేవాసమితి మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం ఏవీ అప్పారావు రోడ్డులోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద వర్ధంతి నిర్వహించారు. సమితి నాయకులు బైర్రాజు ప్రసాదరాజు, మంతెన సత్యనారాయణ రాజు, కోసూరి చండీప్రియ మాట్లాడుతూ అల్లూరి పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దాట్ల భాస్కరరాజు, కోసూరి సుబ్బరాజు, దాట్ల శ్రీధర్ వర్మ, కృష్ణంరాజు, రామకృష్ణంరాజు, బలరామ నాయుడు పాల్గొన్నారు.

దుళ్లలో ఘనంగా అన్నసమారాధన


పోలేరమ్మను దర్శించుకుంటున్న కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్, చిత్రంలో పార్టీ నాయకులు

కడియం: దుళ్ల గ్రామ దేవత పోలేరమ్మ తీర్థ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. గ్రామస్తులు, దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి విశేష సంఖ్యలో జనం తరలివచ్చారు. ప్రతిఏటా పౌర్ణమి రోజున అమ్మవారి తీర్థమహోత్సవం జరపడం ఆనవాయితీ. అందులో భాగంగా నాలుగు రోజులుగా జాతర, విశేష పూజలు జరిగాయి. ఉత్సవాల ముగింపులో భాగంగా అన్నసమారాధన నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో యువకులు, గ్రామస్తులు.. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అమ్మవారికి పూజలు

పోలేరమ్మను వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు దర్శించుకున్నారు. వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, డీసీసీబీ అధ్యక్షుడు ఆకుల వీర్రాజు, జనసేన నాయకుడు కందుల దుర్గేష్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు రావిపాటి రామచంద్రరావు, గిరజాల వీర్రాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, జనసేన మండల అధ్యక్షులు ముద్రగడ జెమి, తదితరులు అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. వారికి ఆలయ కమిటీ ఘన స్వాగతం పలికింది.

వైభవంగా ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ


శివాలయంలో ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: స్థానిక పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం (శివాలయం) ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయంలోని యాగశాలలో సొసైటీ అధ్యక్షుడు గాజింగం సత్తిబాబు, వల్లీదేవి దంపతులు పీటలపై కూర్చొని ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అలాగే ప్రతిష్ఠకు ముందు ధ్వజస్తంభానికి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ఉదయం 11 గంటలకు ఆలయ పండితులు ప్రత్యేక పూజలు చేసి ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ముగిసిన తంటికొండ వెంకన్న కల్యాణోత్సవాలు


శ్రీపుష్పయాగం నిర్వహిస్తున్న పండితులు

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఘనంగా ముగిశాయి. కల్యాణోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం రాత్రి ఈఓ ఆర్‌వీ చందన ఆధ్వర్యంలో స్వామివారికి ఊయల సేవ, శ్రీపుష్పయాగం నిర్వహించారు. జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్ దంపతులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఈఓ చందన మాట్లాడుతూ ఈ ఏడాది భక్తుల సహకారంతో స్వామివారి కల్యాణోత్సవాలను వైభవంగా నిర్వహించినట్టు తెలిపారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- కాటవరం, చినకొండేపూడిలో ఉపవిద్యుత్ కేంద్రాలకు శంకుస్థాపన


కాటవరంలో విద్యుత్ ఉపకేంద్ర శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: మండల ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరం అందించడమే లక్ష్యంగా అవసరమైన చోట్ల విద్యుత్ ఉప కేంద్రాల నిర్మాణం చేపడుతున్నామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. కాటవరంలో రూ.2.75 కోట్లు, చినకొండేపూడిలో రూ. 2.66 కోట్లతో నిర్మించే విద్యుత్ ఉప కేంద్రాలకు ఆదివారం ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాటవరం విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని కాటవరం, మునికూడలి, రాజంపేట, వెదుళ్లపల్లి, చినకొండేపూడి విద్యుత్ ఉప కేంద్రం పరిధిలోని రఘుదేవపురం, సీతానగరం, చినకొండేపూడి, రాపాక, చీపురపల్లి, అచ్చయ్యపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి అవరోధాలు ఏర్పడవన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

వెదుళ్లపల్లి పంచాయతీ పరిధిలోని రాజంపేటలో అక్కిన ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రారంభించారు. అక్కిన ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం ఎంతో హర్షణీయమన్నారు. ప్లాంట్‌కు స్థలం అందించిన కవల సత్తిరాజు కుమారులు కవల కృష్ణమూర్తి, కవల సురేష్‌ను అభినందించారు.

మన్యం వీరుడికి నివాళి

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని చినకొండేపూడిలోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

పురుషోత్తపట్నం పంచాయతీ రామచంద్రపురంలో 22 మంది మహిళలకు ఇళ్ల స్థలాల పట్టాలను, అలాగే చెరుకూరి వెంకటలక్ష్మికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి విడుదలైన రూ.50 వేల చెక్కును ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చేతుల మీదుగా అందజేశారు. వంగలపూడిలో తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ సహకారం రూ.10 లక్షలతో పాటు దాతల సహకారంతో రామాలయం పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రఘుదేవపురంలో పేరంటాలమ్మ సంబరం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నసమారాధనలో పాల్గొన్నారు.

బాధిత రైతులతో సమావేశం

పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం బాధిత రైతులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ బాధిత రైతులకు న్యాయస్థానం ద్వారా ఎక్కువ పరిహారం అందేలా ఉంటే వారికి కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అలాగే ఎకరానికి రూ.28 లక్షలు పరిహారం అందుకోవడానికి రైతులు అంగీకరిస్తే.. ప్రభుత్వం పరిహారం అందించడానికి సుముఖంగా ఉందన్నారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఎస్‌ఈ టీవీఎస్ఎన్ మూర్తి, ఏడీఈ చిట్టిరాజు, ఏఈ చంద్రమోహన్‌రావు, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, గద్దె వీరన్నబాబు, సత్తిపండురాజు, ముదునూరి ప్రసాదరాజు, పోలినాటి రామచంద్రరావు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తాం

ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్య పడవద్దని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. చినకొండేపూడిలో ధాన్యం కళ్లాలను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ఎట్టి పరిస్థితిల్లోనూ వదిలేది లేదని, వర్షాలకు మొలకెత్తిన ధాన్యం ఉన్నా కొనుగోలు చేస్తామన్నారు. దళారులు, వ్యాపారుల చేతుల్లో రైతులు మోసపోకుండా ఉండేందుకు ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు జరుపుతోందన్నారు. ఆయన వెంట ఏడీఏ బీకే మల్లికార్జునరావు, వీఏఏ కోలా అచ్యుత్, వైస్ ఎంపీపీ–1 ముదునూరి సురేష్‌రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు సత్తిపండురాజు, ముదునూరి రామకృష్ణంరాజు, కోసూరి నాగరాజు, మణిరాజు రైతులు నంబూరి త్రిమూర్తులరాజు, చిక్కిరెడ్డి ప్రభు, పందుళ్ల ఆదినారాయణ, కోనే ఇంద్ర తదితరులు ఉన్నారు.